# కార్మికులూ యజమానులూ

బలివాడ కాంతారావు

ఆ గదికి రెండువేపులా రెండు ఆరడుగుల వెడల్పు కిటికీలున్నయ్. రోడ్డువేపున్న కిటికీకి యినుపగజాలూ అద్దాల తలుపులున్నా; యీ కిటికీ యెప్పుడూ మూసేవుంటుంది. దాని కెదురుగావున్న కిటికీ యెప్పుడూ తెరచే వుంటుంది. దానికి గజాలు లేవు. గదిలో నిల్చొని ఆ కిటికీ నుంచి చూస్తే ఫ్యాక్టరీ అంతా కనిపిస్తుంది.

ఈ రోజు రంగారావుకు మెషీన్ల శబ్దం సరిగా వినిపించకపోవటంతో కుర్చీమీద నించి లేచి కిటికీ దగ్గరకు వచ్చాడు. ఒక్క కేక. కొరడాతో కొట్టినట్లు తగిలిందేమో కార్మికులు మెషీన్ల దగ్గరకు కదిలారు. రంగారావుకు ఎన్నెన్నో ఆలోచనలున్నయ్. ఈ మధ్యే హంగేరియన్ లేత్ తెప్పించాడు. బ్రిటన్ నించి హాల్ బ్రూక్ లేత్ దిగుమతి కోసం ప్రయత్నిస్తున్నాడు. అది వస్తే యెలాంటి సున్నితమైన పనైనా చెయ్యించవచ్చు. కానీ వున్న పని వాళ్ళు ఉత్తిసోమరులని అతని బాధ. డ్రిల్లింగ్ మెషీన్ ఆగిపోతే అలా వదిలేస్తారు గానీ బాగుచేద్దామని ప్రయత్నించరు. ప్రివెంటివ్ మెయింటనెన్సు లేకపోవడంవల్ల అంత మంచి హెచ్. ఎమ్. టి. మిల్లింగు మెషీన్ తగలబడింది. అసలు వీళ్లకు యిలా కొమ్ము లిచ్చిందెవరు?

రెండో కిటికీ దగ్గరకు వెళ్లాడు. అద్దాల వించి రోడ్డువేపు చూస్తే శరీరమంతా మండి పోయింది. రెండేళ్ల క్రితం అటువేపు చూడ్డానికి అసహ్యించుకునే వాడు. ఇప్పుడూ అసహ్యం అంతకన్నా యెన్నోరెట్లు పెరిగింది. రెండే ళ్లలో అటు యెంత మార్పు

సరిగ్గా అదేరోజుల్లో రెండేళ్లక్రితం తన ఫ్యాక్టరీలో ఒక సంఘటన జరిగింది. ప్రసాద్ తన అనుమతి లేకుండా తన చెల్లెలిని తెచ్చి ఫ్యాక్టరీ చూపిస్తున్నాడు. ప్రతి మెషీను దగ్గరకు తీసుకవెళ్తుంటే పనివాళ్ళ దృష్టి వారిమీదే. అలాంటప్పుడు మెషీన్ల మీద తయారవుతున్నవి యెందుకూ పనికిరాకుండా పోవా?

'ఎవరి అనుమతి మీద తెచ్చావ్?" అని కేక వేసాడు కిటికీ దగ్గరనిల్చొనే.

'చాల రోజులనించి 'అన్నయ్యా నువ్వు పనిచేసే ఫేక్టరీ చూస్తాన'ని అంటుంటే...."


'అంత వివరంగా చూపిస్తున్నావ్— నీ చెల్లెల్ని ఫ్యాక్టరీ మేనేజర్ని చేస్తావా? ఇక చాలు తీసుకవెళ్లు బయటికి."


"ఈ మాత్రం స్వతంత్రం నాకు లేదా?"

"స్వతంత్రం కావాలట! ఫ్యాక్టరీలో ఏం తమాషా జరుగుతుందో చూసావా? అలా నైలాన్ చీరలతో రంభా వూర్వశీలా తెస్తే...."

"మీకు కోపం వస్తే నన్ను అనండి. మా చెల్లెల్ని అంటే మరి మాట దక్కదు."

"ఏం చేస్తా వేమిటి?"






"ఏం చేస్తానో నాకే తెలియదు."

ఆ మాటలింకా నోటిలోనే వున్నాయి. గూర్ఖా ప్రసాద్‌ని బయటకు లాగేసాడు. ప్రసాద్ కేకలు వేసినా యింత మంది కార్మికులు యజమాని యెరుపుకళ్లు చూసి గుండెల్లో మంటలు భరించారు. రోడ్డు కటువేపు ఒక పాడుపడిన కారుషెడ్డు వుంది. తాళం కూడా వెయ్యలేదు. ఆ షెడ్డు ముందర ఉచ్చల దొడ్డిగా తయారయ్యింది. ఆ ప్రక్కనించి పారుతున్న కుళ్లు కాలవనుండి దుర్గంధం వెదజల్లుతోంది. ఇంత కోపంలో కూడా ప్రసాద్ ముక్కుమూసుకున్నాడు.

"నిన్ను చంపుతాను" అని గొణిగాడు కోపంతో. రొచ్చు కంపును అంటించుకున్న అన్నను లేవనెత్తుతూ చిన్నదైనా సావిత్రి "చంపేం సాధిస్తావు అన్నయా? నీచేత పని తనం వుంది. వాడి కళ్ళ యెదుటగా అలాంటి ఫ్యాక్టరీ నువ్వులేపితే...."

"అంత జాగాయేదీ? అంత డబ్బేదీ?"

"ఇదిగో యీ జాగాలేదా?"

"ఈ కారు షెడ్డా?"

"వాడుకలేక పాడుపడింది. కూలిపోలేదు పూర్తిగా. నీ చేతుల్లేవా బాగుచెయ్యడానికి?"

ఒక్కసారి నిలొచ్చిని నిదానంగా చెల్లెలి వేపు చూసాడు. ఏదో చెల్లెలంటే చెల్లెలు అనుకున్నాడు. గానీ యీ వయసులో యింత తెలుసునని అనుకోలేదు.

"అవును. L.M.E.పాసైనా ఉద్యోగం దొరక్క పిరికివాడినై, నిస్సహాయుడనై టర్నరుగా ఈ రంగారావుగాడి ఫ్యాక్టరీలో చేరాను. నా నిస్సహాయతను అసమర్థతే అనుకున్నాడు. అందుకే యాడ్పించాడు" అనుకుని చుట్టూ చూశాడు. తనలా నిస్సహాయుడెవడో యీ స్థలాన్ని యిలా ఉచ్చలదొడ్డికి అప్పచెప్పాడు. తనెందుకీ స్థలాన్ని శుభ్రం చెయ్యకూడదు? అలా చేస్తే ఈ క్షణంలో తన కుళ్ళిన జీవితం శుభ్రపడం కాకమానదు.

"కుళ్లున్న మనిషి కుళ్లను కడగలేడు. కుళ్లు భాగానించి బయటపడలేడు. రాచెల్లీ రా...." అంటూ ఆ సందునించే వెళ్లాడు. ఆ కారుషెడ్డు యెవరిదో తెలుసుకున్నాడు. అప్పటి కప్పుడే అద్దె నిర్ణయించుకున్నాడు. తిరిగివచ్చి ఒకసారి తలుపు తెరిచి చూశాడు. లోపల యెలుక చచ్చిన వాసన. అంతా పట్లుతోనూ చెత్తతోనూ నిండి వుంది.

"నువ్వు ఇక్కడే వుండు చెల్లీ" అన్నాడు గబగబ ఫ్యాక్టరీ లోపలికి గూర్ఖాను తోసుకుని మరీ వెళ్లాడు. ఆ ఘర్షణలో రంగారావు వచ్చాడు.

"నాకు రావలసిందంతా యిప్పుడే యిచ్చేయి."

"ఎప్పుడో నాకు దయ కలిగినప్పుడిస్తాను"

"దయ. నా కష్టంతో గడించుకున్నదే నా కిమ్మంటున్నాను. నేను మర్యాదగా అడుగుతున్నప్పుడు ఆ మర్యాదను పాటించి నాకు రావలసిన డబ్బు నా కిచ్చేయ్."

"ఇవ్వకపోతే యేం చేస్తావ్?"

"ఏం చేస్తానా?" గొంతెత్తి గట్టిగా అరిచాడు.

కాస్త ముందుకు వెళ్లి "అన్నలారా — తమ్ముల్లారా — ఈవేళ నాకిలా అయ్యింది. రేపు మీగతీ యింతే! ఒక్కడి ఆవేశంతో పది మంది బ్రతుకులూ కూల్చేవాడు పెద్దగా ఎలా వుంటాడు? ఆపండి—పని ఆపండి. మన హక్కులను మనం రక్షించుకుందాం. ఇన్నాళ్లూ మనల్ని గొర్రెల్ని చేసాడు. చీమల్లా నలిపేసాడు. ఒక ప్రవాహంలా వీడిమీద పడి వీడి ఆట కట్టిద్దాం! నేను యీ వుద్యోగంలో వుండే వీడి కళ్లు తెరిపిస్తాను."

రంగారావు గదిలోనికి వెళ్ళిపోయాడు. ఇద్దరు ప్రసాద్‌ని పట్టుకున్నా ఆపడం కష్టమైంది. కొంతసేపయ్యాక గదిలోనికి వారిద్దరు ప్రసాద్‌ని తీసుకవచ్చారు.

"ఆవేశం తగ్గిందా?" అడిగాడు రంగారావు.

ప్రసాద్ అసహ్యంగా చూసాడు.

"నన్ను అసహ్యించుకున్నవాడివి నా ఫ్యాక్టరీని అసహ్యించుకున్నట్టే లెఖ్ఖ! కూనే గాడిద మేసే గాడిదలను చెరుపుతుందట. ఇంద — నీ ఉద్యోగానికి వుద్వాసన చెప్పే కాగితం. ఈ కవరు తీసుకో—యిందులో చట్టరీత్యా నీకు రావలసిన డబ్బంతా వుంది."

ప్రసాద్ రెండూ తీసుకుని "ఈ తెలివి నీకు మొదటే వుంటే-నా గొంతుక పట్టేవాడివి కాదు."

"ఈ డబ్బు వున్నంతకాలం తింటావు. ఖర్చయ్యాక మళ్ళీ యీ ఫ్యాక్టరీ ముందుకు వచ్చి—ఆ ఎదరగా వున్న ఖంగాళీ కుక్కలా తిను—నాకు అభ్యంతరం లేదు. వెర్రి కుక్కలా అరిచావో ఏం జరుగుతుందో చెప్పలేను—వెళ్లు" అన్నాడు.

ప్రసాద్ కుక్కలా అరవనూలేదు. పిల్లిలా దొంగతనంగా పాలు తాగనూలేదు. జీవితంలో తొలిసారి భంగపాటును భరించాడు. కోపాన్ని సవాల్‌గా తీసుకున్నాడు. నిరాశని ఆశగా మార్చడానికి ఎంతో శ్రమ పడ్డాడు. ఆ శ్రమ ఫలించింది. కొత్త వూహలు మనసులో వూగాయి. ఆ వూహలు కార్యరూపం దాల్చాయి. తన కష్టార్జితంతో మొదలిడినదీ కార్ఖానా. ఇప్పుడది కారుషెడ్డు కాదు. ఇటువేపు కిటికీ కట్టెన్లు చిరిగివున్నాయి. గానీ ఆ కారుషెడ్డువేపు కట్టెన్లు కొత్తగా వున్నయ్. బ్యాంకుల సహాయంతో కొత్త మెషీన్లు వస్తున్నాయి. కొత్తరకం వస్తువులు మార్కెట్‌లో కనిపిస్తున్నాయ్. రోజుకు రోజు మార్పు కనిపిస్తోంది. కొత్తపాత అ

తోంది. పాతలో మళ్లీ కొత్త కలిసి సరి కొత్తగా కనిపిస్తోంది.

ఈ కదలిక యిటువేపు రంగారావు ఫ్యాక్టరీలో లేదు. ఆ వుత్సాహం అటులేదు. ఇది నాదీ అన్న బాధ్యత అసలే లేదు. దానికి నాలుగురెట్లు పెద్దదైన యీ ఫ్యాక్టరీ అది గడించిన లాభాల పాటైనా గడించటంలేదు. తన దగ్గరకు ఒకనాడు బిచ్చగానిగా వచ్చినవాడు, తను కాళ్లదన్నినవాడు తన కన్న తను పొడుచుకునేటట్లు పైకొస్తున్నాడు. కిటికీనించి అటు వేపు చూస్తున్న రంగారావు మనసు అందుకే మండిపోతోంది. ఏం చెయ్యడానికీ పాలుపోవటంలేదు.

టెలిఫోన్ వాగడంతో అక్కడనించి కదిలాడు.

మనసులో రాజుతున్న కోపం ఒక్కసారి మంటలా లేచిపోయింది. రొడో కిటికీవేపు గబగబ నడిచాడు. పనివాళ్లంతా ఒకచోట గుమిగూడి సిల్వర్ మగ్గుల్లో టీ తాగుతున్నారు. ఒక్క కేక వెయ్యటంతో అంతా యిటు చూసారు.

"మీరంతా యిలా రండి' అని కేక వేసాడు మళ్లీ.

వాళ్లు ధీమాగా వస్తుంటే—"అలా పెళ్లి నడకలు నడుస్తారేం? కొంపంటుకుపోతే-పరుగెత్తండి" అరిచాడు.

అందరూ క్రింద నిల్చున్నారు. అతను పైనించే—

"ఐదు లక్షలు మనకు లాభం రావలసింది. శాంపిల్ చేసినప్పుడు మీ పనితనం తగలబడబట్టి ఆ ప్రసాద్‌గాడు ఆ కంట్రాక్టు కొట్టేసాడు. మీకు సిగ్గులేవూ? మీకు పౌరుషం లేదూ? మీరు మనుషులా? పశువులా? ఎంత చెప్పాను. మీ బుర్రకెక్కలేదు. పని సరిగ్గా చెయ్యరు—జీతాలు మాత్రం యిచ్చేయాలి. ఈ చాతకాని వాళ్లని—కొరకరాని కొయ్యల్ని కొండముచ్చుల్ని నేను పెంచలేను—పొండి ఎక్కడికి పోతారో పొండి... "

ఇంకాయేవేవో ఆవేశంతో అరుస్తుంటే—

"ఇదిగో నివ్విచ్చిన టీనీరు' అంటూ ఒక కార్మికుడు మగ్గులోని టీని రంగారావు ముఖానికి కొట్టినట్లు పైకి విసిరాడు. కార్మికులంతా ఒక్కుమ్మడిగా ఆ గదిలో చొరపడ్డారు. గూర్ఖా లేదు. ఎవడూ రాలేదు. ఒకడు రంగారావు కమీజు కాలరు పట్టుకున్నాడు.

"మేం పశువులమా? దున్నపోతులమా? కొండముచ్చులమా?" ఇలా అరుపులు వినిపిస్తున్నాయ్.

ఒకడు రంగారావు నోరు తెరిచి టీ పోసాడు. తుప్పున వుమ్మేసాడు రంగారావు.

'ఉమ్మావు కదరా! చేదు-విషం-మాకు తాగమని నువ్విచ్చిన టీ యిది."

'రా' అంటూ అలా అతన్ని అంతా బయటకు లాక్కుని వెళ్ళారు. అంతకుముందే టెలిఫోను తీగలు తెగిపోయాయి. ఎదురుగా వున్న ప్రసాద్ ఫ్యాక్టరీలోనికి చొరబడ్డారు. ఆ సమయంలో టీ ట్రే పట్టుకుని ప్రసాద్ చెల్లెలు సావిత్రి ఒక్కొక్క మెషీన్ దగ్గరకు వెళ్తోంది. కొందరు బిస్కట్లు తింటూ టీ తాగుతూనే పని చేస్తున్నారు.

'ఓ మనిషీ చూడు-అటు చూడవయ్యా-ఇక్కడ కార్మికుల్ని మనిషిగా చూస్తారయ్యా పశువులా కాదు-గొర్రెలా కాదు. అందుకే యిక్కడ అంతా నాదీ అన్న భావం వీళ్లలో వున్నది. అందుకే వాళ్లంతా బాగా పని చేస్తున్నారు."

ఇంకా ముందుకు తోస్తూ,

"ఇక్కడ నెల రోజులపాటు ప్రసాద్ బాబు దగ్గర పనిచెయ్యి. నేర్చుకొనిరా.... అప్పుడు మామీద పెద్దగా మెసులు....ఈ షరతుకు ఒప్పుకుంటావా లేదా?" గద్దించారు.

"ఊహుఁ—చస్తే ఒప్పుకోను" అన్నాడు.

"అయితే చావు" అని మనిషో చెయ్యి వెయ్యగానే చప్పున ప్రసాద్ కలుగజేసుకున్నాడు.

"వదలండి. అతను నేర్చుకోవలసింది నా దగ్గర కాదు. నేనేమీ చెయ్యలేదు. చేసింది యింకొకరు...."

"ఆ యింకొకరిదగ్గర నేర్చుకుంటావా! లేక చస్తావా?" అన్నాడు వాళ్లల్లో పెద్ద. ఉద్రేకాలు పెరిగిపోతున్నాయి.

"చాతకానోడు ఎవడికోసం నేర్చుకోడు? ఎందుకు నేర్చుకోడు?" అని అరుస్తున్నారు.

పరిస్థితి మెరుగుపడేటట్లు లేదు.

"ఇంకెవరిదగ్గరైనా నా కభ్యంతరంలేదు" అన్నాడు విధిలేక చివరకు రంగారావు.

చుట్టుముట్టిన కార్మికులు త్రోవ వదిలారు. ప్రసాద్ ముందు నడవగా వెనుకను రంగారావు—ఆ వెనుక కార్మికులంతా నడిచారు. పెరటకు ఫ్యాక్టరీ ప్రాకిపోయింది ఆ చివర్లో ఒక గది వుంది. బయట 'మేనేజరు' అని బోర్డు వుంది. ప్రసాద్ తలుపు తోసి ఆ స్ప్రింగ్‌డోర్‌ని పట్టుకున్నాడు. ఎదరగా టేబిలూ కుర్చీ వున్నాయి.

"ఈవిడా?" రంగారావు నిట్టూర్చాడు.

"అవును. ఈ ఫాక్టరీ మేనేజరు. ఫేక్టరీకి తల్లిలాంటిది. ఈ కార్మికులందరూ ఆమెను స్వంత తల్లిలానే చూస్తున్నారు."

సావిత్రి లేచి "రండి-రంగారావుగారూ-కూర్చోండి" కూర్చోబెట్టి ఆమె నిల్చొనే

"ఆ నాటి మీ దీవన బ్రహ్మ దీవనైంది. నేను మేనేజర్నే అయ్యాను."

"వీడికి నేర్పండమ్మా-మనిషిని మనిషిగా చూడ్డం నేర్చుకుంటాడు" అన్నాడు కార్మికుల పెద్ద.

"ఇలాంటి సంఘటనలు ఎప్పుడోగాని జీవితంలో జరగవు. వాటిని వల్లించి ఎవరికి వారే గుణపాఠం నేర్చుకుంటే మంచిది" అంటూ ముందుకొచ్చి.

"ఈయన మూలాన మా ఫ్యాక్టరీ స్థాపించాం. ఈయన యింకో ఫ్యాక్టరీ పెద్ద కూడా! అంచేత ఆయన కివ్వవలసిన మర్యాద యిచ్చి మరీ పంపిస్తాం. మీరంతా వెళ్లండి దయచేసి."

ఒకరొకరూ కదిలిపోయారు. ప్రసాద్ కూడా అక్కడ నించి వెళ్ళిపోయాడు. ఇద్దరే ఆ గదిలో. స్ప్రింగ్‌డోర్ మూసుకుపోయింది. రంగారావు తలెత్తి చూసాడు సావిత్రి నైలాన్‌చీరె కట్టుకునివుంది. ఇదివరకన్నా హుందాగా వుంది. మనోహరంగావుంది. అలంకరించుకుని వుంది. ఐనా తనకు ఇంకో వూహ రాలేదు. ఇంకో కోరిక పుట్టలేదు. తన తల్లిలా కనిపించింది. కామధేనువుగా మారింది. మరోక్షణంలో ఆమె మంచితో, మహిమతో దేవతలా ప్రత్యక్షమైంది.

ఆమె యెదురుగా అలా కూర్చొనే వెక్కివెక్కి యేడవడానికి మొదలుపెట్టాడు. ఎంత సేపటికోగానీ ఆ దుఃఖం ఆగలేదు. ఆమె యేడవద్దని అనలేదు. ఎందుకేడుస్తున్నావనైనా అడగలేదు. ఆమెకు అంతా అర్థమైపోయింది.

